మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్

- దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.3 వేలు పింఛన్
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కొత్తగా మంజూరైన పింఛన్‌ను అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: పింఛన్ల పెంపు విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.3 వేలకు పింఛన్లను పెంచి అందజేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకను పొదలకూరులోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం పండగ వాతావరణంలో లబ్ధిదారులకు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డితో కలిసి మంత్రి కాకాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం విడతల వారీగా పింఛన్ నగదును పెంచారని తెలిపారు. ప్రతి నెలా జిల్లాలో 3,19,952 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.95.54 కోట్ల నగదును పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 40,732 మంది లబ్ధిదారులకు రూ.12.25 కోట్లు పింఛన్ల కింద అందజేస్తున్నామన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు పెత్తనం ఇచ్చి అర్హులైన వారికి పెన్షన్లు నిలిపివేయించిన ఘనత చంద్రబాబుదని విమర్శించారు.

మీ సేవకుడిగా మరో అవకాశం ఇవ్వండి

రానున్న ఎన్నికల్లో మీ సేవకుడిగా మరో అవకాశం ఇవ్వాల్సిందిగా మంత్రి కాకాణి ప్రజలను కోరారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా సర్వేపల్లి నియోజకవర్గానికి సేవ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అభివృద్ధిలో సర్వేపల్లి నియోజకవర్గం ముందంజలో ఉందని తెలిపారు. రహదారులు, భవనాలు, గ్రామాల్లో సిమెంటు రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, మంచినీటి సదుపాయం, సాగునీటి నిర్వహణకు వందల కోట్ల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇప్పటికే సర్వేపల్లి నియోజకవర్గానికి రూ.90 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. పొదలకూరు పట్టణ తాగునీటి అవసరాలకు కండలేరు నుంచి ప్రత్యేక పైపులైన్ నిర్మాణం రూ.4.50 కోట్లతో చేపట్టామని తెలిపారు. కొందరు పగటి వేషగాళ్లు ఇప్పటికిప్పుడు వచ్చి తాము అభివృద్ధి చేశామని ఓట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సోమిరెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమిరెడ్డి పొదలకూరు మండలంలో డ్రైవర్ లేకుండా సొంతంగా గ్రామాలను గుర్తించి వెళ్లాల్సిందిగా సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్‌కుమారి, తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఎంపీపీ కె.సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, సర్పంచ్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందించేందుకు చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి


అధికారులతో మాట్లాడుతున్న సత్యవాణి

కోవూరు: జిల్లాలో ఈ సీజన్‌లో రైతులకు ఎరువులు అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు రైల్వే యార్డు నుంచి ఆర్బీకేలకు పంపేందుకు సిద్ధంగా ఉన్న లోడ్ లారీలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రబీ సీజన్లో 3 లక్షల ఎకరాల్లో వరి, 1.50 లక్షల ఎకరాల్లో ఇతర వంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ఎరువులు ఎంత అవసరమో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 49 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చినట్లు తెలిపారు. మరో మూడు నెలల్లో 51 వేలు మెట్రిక్ టన్నులు వచ్చేలా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఈ వారంలోగా 10 వేలు మెట్రిక్ టన్నులు రానున్నట్లు చెప్పారు. పడుగుపాడు రైల్వే యార్డులో ఈ కార్యక్రమ ఇన్‌చార్జిగా సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాతను నియమించామన్నారు. రైతులకు ఈ సీజన్లో కావాల్సిన ఎరువులను అందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందన్నారు. ప్రధానంగా డెల్టా ప్రాంతమైన కోవూరులో ఎరువులను సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు పంపడం జరిగిందన్నారు. ఇటీవలి కాలంలో పడుగుపాడు యార్డులో ఏర్పడిన పలు సమస్యల కారణంగా ఎరువుల రవాణాలో కొంతమేర అంతరాయం కలిగిందన్నారు. రబీ సీజన్లో రైతులు యూరియా ఎక్కువగా వాడడం వల్ల చీడ పురుగుల ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని సిఫార్సు చేసిన మేరకు ఎరువులు వాడుకోవాలన్నారు. అన్ని మండలాల్లో ఉన్న వ్యవసాయాధికారులు వారి పరిధిలో ఉన్న ఆర్బీకేలు, ప్రైవేట్ ఎరువుల డిపోలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. కౌలు రైతులకు బ్యాంక్ రుణాలు కావాలంటే ఆయా గ్రామాల్లోని మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. రైతులు ఈ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదుకు వ్యవసాయ సహాయకులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు సర్వోజీరావు, ఇందిరావతి, వీఏఓలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో కార్మికుల సంక్షేమానికి సీఎం సహకారం

నెల్లూరు(బృందావనం): ఆటో కార్మికుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సహకారాన్ని అందిస్తున్నారని పలువురు కొనియాడారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కేక్‌ను కట్ చేసి.. మిఠాయిలను వైఎస్సార్ ఆటో యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు సంపతి హనుమంతరావు, కార్పొరేటర్ వేలూరు మహేష్, యూనియన్ అధ్యక్షుడు ఆంథోనీ, సభ్యులు శివ, ధనుంజయ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పద్మావతికి సన్మానం



నెల్లూరు సిటీ: డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ పద్మావతిని ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నగరానికి వచ్చిన ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, ట్రెజరర్ రవీంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ అహ్మద్‌బాబు, బాలచందర్‌బాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో అనధికార మద్యం విక్రయాలపై చిన్నబజార్ పోలీసులు దాడులు చేసి ఇద్దర్ని అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. శివగిరికాలనీకి చెందిన ముత్తు కొంతకాలంగా ఇంటి వద్దే అనధికారికంగా మద్యం విక్రయాలను సాగిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న చిన్నబజార్ ఎస్సై సైదులు తన సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. అతడిని అరెస్ట్ చేసి 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

- ఇరుగాళమ్మ సంఘం సమీపంలో చిల్లర దుకాణాన్ని నిర్వహిస్తున్న సత్తురాజు అనధికారికంగా మద్యం విక్రయాలను సాగిస్తుండటంతో ఎస్సై దాడి చేశారు. సత్తురాజును అరెస్ట్ చేసి దుకాణంలోని 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఏపీజీబీలో ప్రగతి కుబేర్ పథకం : ఆర్‌ఎం


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ప్రగతి కుబేర్ – 444 నూతన డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టామని బ్యాంక్ రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సాధారణ ఖాతాదారులకు 7.5 శాతం, మహిళలు, సీనియర్ సిటిజన్లకు ఎనిమిది శాతం వడ్డీని అందజేయనున్నామని వివరించారు. రుణాలను సైతం సులభతరంగా జారీ చేయనున్నామని తెలిపారు. సమావేశంలో చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ మేనేజర్లు శ్రీకాంత్ నెహ్రూ, అజయ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి..

- వ్యక్తికి తీవ్రగాయాలు

మర్రిపాడు: మండలంలోని కొత్తఅల్లంపాడు సమీపంలో మోటార్‌బైక్ అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పాత అల్లంపాడుకు చెందిన రాగి చెంచయ్య బైక్‌పై ఖాదర్‌పూర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా బైక్ అదుపుతప్పింది. దీంతో తీవ్రంగా గాయపడిన చెంచయ్యను 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. 93 రోజులకు గానూ కానుకల రూపంలో భక్తులు రూ.9,09,746 మేర సమర్పించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడండి


మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు రైతులను కోరారు. కొడవలూరు ఇరిగేషన్ కార్యాలయ ప్రాంగణంలో సాగునీటి వినియోగంపై కొడవలూరు, విడవలూరు మండలాల రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ సోమశిల జలాశయంలో 33.899 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉన్నందున సాగునీటిని పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా చివరి ఆయకట్టు పంట పూర్తయ్యే వరకూ నీటిని అందించగలమని చెప్పారు. రెండు వారాలు ఏకధాటిగా సాగునీరు విడుదల చేసి ఒక వారం విరామం ఇవ్వాలని రైతులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో ఈనెల 21వ తేదీ వరకూ విడుదల చేసి అనంతరం ఒక వారం నిలిపివేయడం జరుగుతుందని, ఆ తర్వాత మళ్లీ రెండు వారాలు వదులుతామని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేశారు. సమావేశంలో ఇరిగేషన్ డీఈ ఎస్.మధుసూదన్, కొడవలూరు, బుచ్చి, కోవూరు ఇరిగేషన్ ఏఈలు పార్థసారథి, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.శంకర్ పాల్గొన్నారు.

ప్రజలకు సకల శుభాలు చేకూరాలి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


వేడుకల్లో పాల్గొన్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ సకల శుభాలు చేకూరి ఆయురారోగ్యాలతో ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. న్యూ ఇయర్ సందర్భంగా పొదలకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మంత్రి అభిమానులు, ప్రజల మధ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలు


గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కోవూరు: మండలంలో బుధవారం నుంచి సచివాలయ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీహరి తెలిపారు. మంగళవారం ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు కొత్తూరులోని కేఎస్ఎస్ కళాశాల, నేతాజీ నగర్లో ఉన్న క్రీడా మైదానాలను పరిశీలించారు. వీటితోపాటు వేగూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో కూడా క్రికెట్ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వై.చెంచులక్ష్మమ్మ, ఫిజికల్ డైరెక్టర్లు మధుసూదన్‌రావు, రమేష్‌బాబు, దేవిక, పీఈటీలు వెంకటసుబ్బమ్మ, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు


టీకాలు వేస్తున్న దృశ్యం

కోవూరు: కోవూరు పశుసంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలో కోవూరు, విడవలూరు మండలాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పాడిరైతులకు ఆ శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ కష్ణమౌర్య సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రంలో విధులు నిర్వహించే సహాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మంగళవారం కోవూరులో 85 పశువులకు, వేగూరులో 45, లేగుంటపాడులో 46, దండిగుంటలో 47 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నెల్లూరు నగర నియోజకవర్గానికి సంబంధించి మూలాపేటలోని ఈఎస్సార్‌ఎం, సంస్కృత, బాలిక పాఠశాలలు, సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం, మోడల్ హైస్కూల్, జాకీర్‌హుస్సేన్ నగర్‌లోని మున్సిపల్ పాఠశాల తదితరాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ సదుపాయం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక వీల్ చైర్లు తదితరాలను పర్యవేక్షించాలని సూచించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

రాజకీయ పార్టీల నుంచి అందిన అర్జీలు, ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. ఓటర్ల లిస్ట్ డ్రాఫ్ట్ రోల్, రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమపద్ధతిలో నమోదు చేసి, క్షేత్రస్థాయిలో బీఎల్వోలు పరిశీలించాలని సూచించారు. ఓటు దరఖాస్తు, మార్పులు, చేర్పులకు సంబంధించిన గడువు ముగిసిన నేపథ్యంలో వివిధ ఫారాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి.. రోజువారీ నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల విభాగాధికారులు దేవీకుమారి, శ్రీనివాసులు, మాధవి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

పొదలకూరు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కె.సుబ్బరాయుడు అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ నగేష్‌కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చ జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు.

ఆర్బీకేల్లో యూరియా పంపిణీ



కొడవలూరు: మండలంలోని కమ్మపాళెం, యల్లాయపాళెం ఆర్బీకేల్లో రైతులకు మంగళవారం యూరియా పంపిణీ చేశారు. ఏఓ లక్ష్మి చేతుల మీదుగా యూరియా, డీఏపీ ఎరువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ఆర్బీకేల్లో యూరియా, డీఏపీలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏలు ఒ.సుజిత్, జి.ఉమామహేష్ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై శిక్షణ



మనుబోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. గైడ్ టీచర్ హరికృష్ణ ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు ఎలా వినియోగించాలో వివరించారు. టీచర్లు విద్యార్థులకు నేర్పుతారని ఆయన అన్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్‌ను ఢీకొనడమే కాకుండా ప్రశ్నించిన వ్యక్తిపై నిందితుడు దాడి చేసి గాయపర్చాడు. మంగళవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. ఎన్టీఆర్ నగర్‌లోని పిండిమిల్లు సమీపంలో సెల్‌ఫోన్ వ్యాపారి శివకుమార్ నివాసం ఉంటోంది. బాలాజీనగర్‌లోని చికెన్ స్టాల్‌కు బైక్‌పై సోమవారం ఆయన వెళ్లారు. ఈ క్రమంలో ఏసీనగర్‌లోని మహాలక్ష్మమ్మ గుడి సమీపంలో అతని వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో వేగంగా ఢీకొన్నాడు. దీనిపై ప్రశ్నించిన శివకుమార్‌పై దాడి చేసి గాయపర్చాడు. బాధితుడు తొలుత జీజీహెచ్‌లో చేరాడు. అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాడు. ఫిర్యాదు అందుకున్న బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా


ఇందుకూరుపేట: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్


కోవూరు: అద్దాలు అందజేస్తున్న నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు: 'జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రభుత్వం పేదలకు భరోసా కల్పించింది. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు.' అని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరు మండలం చెర్లోపాళెం గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కేవలం మన రాష్ట్రంలో మాత్రమే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ముంగిటికే వైద్యసేవలు అందించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు ప్రజల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీహరి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి పడుగుపాడు సొసైటీ చైర్మన్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ నిరంజన్ తదితరులు మాట్లాడారు. అనంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.సుశీల, డాక్టర్ వి.ప్రదీప్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, కె.నరసమ్మ, పీహెచ్‌ఎన్ కె.కృష్ణమ్మ, ఎంపీహెచ్‌ఎస్ ఇలియాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవిస్‌పేటలో..

ఇందుకూరుపే: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని దేవిస్‌పేటలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. దీనిని సర్పంచ్ మేనాటి ప్రభావతమ్మ ప్రారంభించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రమేష్ పరిశీలించి మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం లక్ష్యాలను ఆరోగ్య సిబ్బంది చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, వైద్యాధికారులు కిశోర్, బ్రహ్మేశ్వరనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు


సంగం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ హరినారాయణన్

సంగం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ వైద్యులను ఆదేశించారు. సంగం మండలంలో కలెక్టర్ మంగళవారం ఉదయం విస్తృతంగా పర్యటించారు. తొలుత మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేసి వైద్యసేవలను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటిరోజు జిల్లా వ్యాప్తంగా 17 జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు జరుగుతున్నాయన్నారు. సంగం పీహెచ్‌సీలో 60 రకాల వైద్యపరీక్షలు నిర్వహించేలా ల్యాబ్ సదుపాయాన్ని మెరుగుపరచడం జరిగిందన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంప్ పరిశీలన

మండలంలోని దువ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను కలెక్టర్ పరిశీలించారు. హెల్ప్‌డెస్క్, స్పాట్ సర్వే కౌంటర్, రిజిస్ట్రేషన్, కేస్ షీట్, ల్యాబ్ టెస్టింగ్ కౌంటర్స్, ఓపీ ఏర్పాట్లను పరిశీలించారు. వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం దువ్వూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ గోపి, వైఎస్సార్‌సీపీ నేత కంటాబత్తిన రఘునాథరెడ్డి, దువ్వూరు సొసైటీ చైర్మన్ సూరి మదన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ల సమావేశం రేపు


మాట్లాడుతున్న పెంచలప్రసాద్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో గురువారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎనర్జీ అసిస్టెంట్ల సమావేశాన్ని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పెంచలప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్‌ను డిక్లేర్ చేసి.. ట్రెజరీల ద్వారా వేతనాలను చెల్లించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. నేతలు రసూల్, సునీల్‌కుమార్, ప్రసన్నకుమార్, కృష్ణ, వేణు, రవీంద్ర, దినేష్, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.